

శ్రీవారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలను తీసుకెళుతున్న ఏఈఓ పార్థసారథి మాజీ అధ్యక్షుడు శ్రీకృష్ణ తదితరులు తదితరులు

టీటీడీ ఆలయంలో నేత్రపర్వంగా ఉగాది ఆస్థానం

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని టీటీడీ సమాచార కేంద్రంలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ఉగాది ఆస్థాన వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. ఉదయం 9 గంటలకు శ్రీవారి ఆలయంలో ప్రత్యేక ఆరాధన, పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు జరిపారు. ముందుగా గర్భాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో స్థానిక సలహామండలి మాజీ అధ్యక్షులు ఆనంద్‌కుమార్ రెడ్డి, శ్రీకృష్ణ, పీవీఆర్ కృష్ణారావు, మాజీ సభ్యులు అశోక్, అజయ్, రంగారెడ్డి, రవిబాబు, ద్రవిడ దేశం కృష్ణారావు, రాధాకృష్ణ, సుధాకర్‌రెడ్డి, మాజీ బోర్డు సభ్యుడు శంకర్, ఏఈఓ పార్థసారథి నగర ప్రముఖులు కలసి శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం గర్భాలయం హాలులో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని మామిడి, అరటి తోరణాలు, రకరకాల పూలతో అందంగా అలంకరించారు.



ఉగాది ఆస్థానంలో సర్వాలంకరణశోభితులైన పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారు

మాడభూషి, గుడిమెట్లకు 'ఉగాది' పురస్కారం

● విజయవాడలో ఏపీ సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రదానం





ఆంధ్ర సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారాలు అందుకుంటున్న మాడ భూషి సంపత్‌కుమార్, గుడిమెట్ల చెన్నయ్య

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది సందర్భంగా నిర్వహించిన సంబరాల్లో నగరానికి చెందిన ఇద్దరికి ఉగాది పురస్కారాలు లభించాయి. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు, ప్రస్తుత ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్ సాహిత్య రంగంలో ఆయన చేసిన కృషిని అభినందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేశారు. మాడభూషి సంపత్ కుమార్ జీవితం-కవిత్వం, శత్రువుతో ప్రయాణం, ఆలోచనలు, చివరకు నువ్వే గెలుస్తాము, మూడో మనిషి, వికారి, మొదటి అబద్ధం, అరవై శరత్తులు తదితర కవితా సంపుటాల సహా 35 గ్రంథాలు రచించారు. ఆయన పర్యవేక్షణలో 30 మంది పీహెచ్‌డీ, 78 మంది ఎంఫిల్ చేశారు. అనేక సదస్సులు నిర్వహించడంతో పాటు, జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. ఆయనకు ఉగాది పురస్కారం లభించినందుకు తెలుగు భాషాభిమానులు ఎందరో అభినందనలు తెలిపారు.

గుడిమెట్ల చెన్నయ్యకు... : ఇదే విధంగా నగరానికి చెందిన తెలుగు తల్లి ముద్దుబిడ్డ, 'జనని' సాంఘిక సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గుడిమెట్ల చెన్నయ్యకు తెలుగు భాష కోసం దశాబ్దాలుగా చేస్తున్న సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది పురస్కారంతో సత్కరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు.

ఏటీఎం ఛార్జీ పెంపుపై స్టాలిన్ ఆగ్రహం

● ఇక పేదలకు బ్యాంకింగ్ సేవలు దూరం



చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెల నుండి ఏటీఎంలలో బ్యాంకులు అనుమతించిన ఐదుసార్లు, మూడుసార్లకు మించి డబ్బు డ్రా చేసినందుకు వసూలు చేస్తున్న రుసుమును పెంచుతూ రిజర్వు బ్యాంక్ జారీ చేసిన ఉత్తర్వుపై డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మండిపడ్డారు. రిజర్వు బ్యాంక్ నిర్ణయం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత దూరం అవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన చేస్తూ ప్రస్తుతం డిజిటల్ పద్ధతిలో నగదు బట్వాడా సరళతరంగా మారినప్పటికీ పేదలు డెబిట్ కార్డుల ద్వారానే ఏటీఎంలో నగదు డ్రా చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే నగరాల్లో మూడుసార్లకు మించి, ఐదుసార్లకు మించి ఏటీఎంలలో డబ్బు డ్రా చేస్తే తడవకు రూ.21లను రుసుము వసూలు చేస్తున్నారని, మే ఒకటి నుండి ఈ రుసుము రూ.23లకు పెరుగుతుందన్నారు. పేదలకు తమ బ్యాంకులో జమ అయ్యే సల్పనగదును ఏటీఎం ద్వారా డ్రా చేసుకుంటారని, ఇలా తడవకు రూ.23ల చొప్పున వసూలు చేస్తే వారి ఖాతాలో దాచుకున్న రెండు, మూడు వందల రూపాయలను డ్రా చేసుకోలేని పరిస్థితి వస్తుందన్నారు. అందరికీ బ్యాంక్ ఖాతాలంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలను బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ప్రేరేపించిందని, ఆ తర్వాత పెద్ద నోట్ల రద్దుచేసిన తర్వాత ఆ నోట్ల రద్దువల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న సామాన్య ప్రజానీకం దృష్టిని మరల్చేందుకు ఉన్నట్టుండి డిజిటల్ ఇండియా నినాదాన్ని చేతులకెత్తుకుందన్నారు. ఆ తర్వాత డిజిటల్ నగదు బట్వాడాకు రుసుము వసూలు చేశారని, అకౌంట్ మినిమమ్ బ్యాలెన్స్ లేవంటూ పెనాలిటీల పేరుతో డబ్బులు గుంజారని, ఇవన్నీ చాలవని ప్రస్తుతం ఏటీఎంలో పరిమితికి మించి డబ్బు డ్రా చేస్తే తడవకు రూ.23ల చొప్పున వసూలు చేయడానికి సిద్ధమవుతున్నారని స్టాలిన్ విమర్శించారు. ఇలా తాము కష్టపడి సంపాదించి దాచుకున్న సొమ్ములో అధికభాగాన్ని పేదలు ఏటీఎం లావాదేవీల ఛార్జీల రూపంలో డబ్బులు కోల్పోతారన్నారు. రిజర్వు బ్యాంక్ అధికారులు ఇకనైనా పేదల సొమ్మును ఇలా నిలువుదోపిడీ చేయడానికి బదులు పేదలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రంలోని బీజేపీ పాలకులు ఏటీఎం ఛార్జీల పేరుతో జరుగనున్న వసూళ్లను నిలిపివేయడానికి చర్యలు తీసుకోవాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు.

సెంగోటయ్యన్‌కు 'వై' కేటగిరి భద్రత!

కేంద్రం పరిశీలన



ప్యారీస్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీమంత్రి సెంగోటయ్యన్‌కు 'వై' కేటగిరి భద్రత కల్పించడంపై కేంద్రప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దివంగత మాజీముఖ్యమంత్రి ఎంజీఆర్ అన్నాడీఎంకేను ప్రారంభించినప్పటి నుండే సెంగోటయ్యన్ ఆ పార్టీలో కీలక పదవుల్లో రాణించారు. ప్రస్తుతం ఆయన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామితో ఉన్న సన్నిహిత సంబంధాలన్ని తెంచుకుని పార్టీ కార్యకలాపాలన్నిటికీ దూరంగా వుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను సెంగోటయ్యన్ కలుసుకున్నారు. తనకు బెదిరింపులు వస్తున్న కారణంగా వై కేటగిరి భద్రత కేటాయించాలని సెంగోటయ్యన్ హోంమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు విశ్వసనీయ సమాచారం. త్వరలోనే సెంగోటయ్యన్‌కు వై కేటగిరి భద్రత కల్పించే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

దీపావళి, వేలం చిట్టీల పేరిట రూ.2 కోట్ల మోసం

● దంపతుల అరెస్టు

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి ఫండ్ చిట్టీలు, నెలవారీ చిట్టీల పేరిట సుమారు రూ.2కోట్ల మేరకు మోసగించిన దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. కళ్లకురిచ్చి అన్నానగర్‌లో సూర్యమహాలక్ష్మి, శివకుమార్ అనే భార్యభర్తలు నివసిస్తున్నారు. వీరిద్దరూ గత కొన్నేళ్లుగా దీపావళి ఫండ్ చిట్టీలు, నెలవారీ చిట్టీలు నడుపుతున్నారు. వారం రోజుల క్రితం గంగా అనే వ్యక్తి ఈ దంపతులు తనకు చిట్టీ సొమ్ము ఇవ్వలేదని, ఇదేవిధంగా పలువురు చందాదారులను మోసగించారని ఆరోపిస్తూ కళ్లకురిచ్చి జిల్లా ఎస్పీ రజత్ చతుర్వేదికి ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా క్రైం డీఎస్పీ ముత్తుమణి నాయకత్వంలో సీఐ ప్రభావతి, ఎస్‌ఐ నందకుమార్ తదితరులతో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి దిగి విచారణ జరిపింది. ఆ విచారణలో శివకుమార్, సూర్యమహాలక్ష్మి కలిసి 2017లో దీపావళి ఫండ్ చిట్టీలను, నెలవారీ వేలంచిట్టీలు నడిపారు. ఏంబేర్ ప్రాంతానికి చెందిన చందాదారులు ప్రతినెలా రూ.లక్ష నుండి రూ.5లక్షల వరకు చెల్లించేవారని, 2022 వరకు అన్నీ సవ్యంగా జరిగినప్పటికీ ఆ తర్వాతి సంవత్సరం నుండి వేలం పాడిన పలువురు చందాదారులకు నగదు చెల్లించకుండా మోసగించారని వెల్లడైంది. చిట్టీల ద్వారా వసూలు చేసిన సొమ్మును ఈ దంపతులు ఫైనాన్స్ సంస్థలో పెట్టుబడిగా పెట్టారని, అధికవడ్డీలకు రుణాలు కూడా ఇచ్చి సంపాదించారని తెలుసుకున్నారు. 54 మంది చందాదారుల వద్ద రూ.2.60 కోట్ల మేరకు వసూలు చేసి మోసగించినట్లు రుజువైంది. గత యేడాది ఆ దంపతులు పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో కళ్లకురిచ్చి విడిచిపెట్టి పారిపోయారు. ఈ నేపథ్యంలో ఆదివారం వేకువజాము ఆ దంపతులు కళ్ళకురిచ్చి బస్‌స్టేషన్ వద్ద సంచరిస్తున్నట్లు సమాచారం అందటంతో పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి ఇరువురినీ అరెస్టు చేశారు.

ఈ సీన్ మళ్లీ రిపీటయ్యేనా?

బలమైన పొత్తు కోసం చర్చలు ● త్వరలో అన్నాడీఎంకే బీజేపీ నేతల భేటీ



చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గత లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోవటానికి వేర్వేరుగా పోటీ చేయడమే కారణమని భావిస్తున్న అన్నాడీఎంకే, బీజేపీ పార్టీల మధ్య మళ్ళీ కొత్త సంబంధాలు ఏర్పడనున్నాయి. ఈ రెండు పార్టీల నాయకులు ఎడప్పాడి పళనిసామి, అన్నామలై వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులు గురించి ఏం చెప్పకపోయినా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాత్రం కుండబద్దలు కొట్టినట్లు అన్నాడీఎంకే, బీజేపీ మధ్య పొత్తు ఖరారవుతుందని, మెగా కూటమి ఈ సారి బరిలోకి దిగి అవినీతి డీఎంకే ప్రభుత్వాన్ని రాష్ట్రం నుండి తరిమికొడుతుందని లోక్‌సభలోనే ప్రకటించడం విశేషం. జాతీయ స్థాయి నాయకుడు అందులోనూ హోంమంత్రి చెప్పిన మాటలకు తిరుగులేదు కదా. ఈ నేపథ్యంలో ఢిల్లీ వెళ్లి తిరిగి వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పొత్తుపై నిర్ణయం అంతా పార్టీ అధిష్టానవర్గానిదేనని, ఏ నిర్ణయమైనా శిరసావహిస్తామని ప్రకటించారు. ఆ మాటలను బట్టి అన్నాడీఎంకేతో పొత్తు ఖరారవుతుందని స్పష్టమవుతోంది. ఈ నేపథ్యం ఏప్రిల్ ఆరంభంలో రెండు పార్టీల సీనియర్ నేతలు కలుసుకుంటారని ఆయా పార్టీల వారు చెబుతున్నారు. మొదట సినీనటుడు విజయ్ పార్టీ తమిళగవెట్రి కళగం వైపు దృష్టిసారించిన ఈపీఎస్ చివరకు బీజేపీతో పొత్తుకు సిద్ధమయ్యారు. ఆగమేఘాలపై హస్తినకు వెళ్ళి హోం మంత్రి అమిత్‌షాను కలుసుకుని పొత్తుకు పచ్చజెండా ఊపేశారు. అంతే వేగంతో అన్నాడీఎంకే సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి సెంగోటయ్యన్ కూడా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను, హోంమంత్రి అమిత్‌షాను రహస్యంగా కలుసుకున్నారు. సెంగోటయ్యన్ కూడా బీజేపీతో పొత్తుకు అంగీకరించి ఇకపై పార్టీ నేత ఈపీఎస్‌తో సఖ్యతగా మెలగుతానని అమిత్ షాకు భరోసా ఇచ్చి ఢిల్లీ నుండి తిరిగొచ్చారని అన్నాడీఎంకే వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితులలో రాష్ట్ర బీజేపీ , అన్నాడీఎంకేకు చెందిన సీనియర్ నేతలు త్వరలో కలుసుకుని పొత్తు ఖరారు విషయమై, సీట్ల పంపిణీ గురించి సమగ్రంగా చర్చలు జరుపనున్నారని కమలనాథులు చెబుతున్నారు.

అట్టహాసంగా జల్లికట్టు
హాజరైన చియాన్ విక్రమ్, నటి దుషారా విజయన్ ..... 7లో...

ఆ పాటతో నా జన్మ చరితార్థమైంది : చంద్రబోస్

● ఘనంగా కళాసుధ ఉగాది వేడుకలు



ఉత్తమ నటి అవార్డును అందుకుంటున్న ఇంద్రజ

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మన మాతృభాషకే అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాట రాసే అవకాశం కల్పించిన సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, దర్శకుడు ఎస్ఎస్.రాజమౌళికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటూ, ఈ పాటతో తన జన్మచరితార్థమైనదని ప్రముఖ సినీ గేయరచయిత చంద్రబోస్ అన్నారు. శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో 'విశ్వావసు' ఉగాది వేడుకలు ఆదివారం సాయంత్రం రాయపేటలోని మ్యూజిక్ అకాడెమీలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని 'ఉగాది పురస్కారాలు - మహిళా రత్నపురస్కారాల'ను ప్రదానం చేశారు. ముందుగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అశ్విని శాస్త్రి వేదాశీర్వచనం, పంచాగ పఠనంతో ప్రారంభమైంది. ఆ తర్వాత ఘంటసాల సావిత్రి కుమార్ ప్రార్థనా గీతాన్ని ఆలపించగా, నవదుర్గం బృందం కూడి పూడి నృత్యం, హరిప్రియ, డాక్టర్ మీనాక్షి పలు పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమం వీజీఎన్ హోమ్స్ డైరెక్టర్, క్రెడాయ్ ప్రెసిడెంట్ పద్మ దేవదాస్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభంకాగా, శ్రీ కళాసుధా తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షోపన్యాసం చేశారు. ఎస్‌బీఐ చెన్నై సర్కిల్ జనరల్ మేనేజర్ ఎంవీఆర్ మురళీకృష్ణ అధ్యక్షత వహించిన ఈ వేడుకలో ప్రముఖ నిర్మాత ఏ.ఎం. రత్నం, దివంగత నటుడు కృష్ణంరాజు సతీమణి ఉప్పలపాటి శ్యామలదేవి పాల్గొన్నారు. 26వ ఉగాది పురస్కారాలను 2024-25 సంవత్సరానికిగాను సినీరంగం నుంచి ఉత్తమ కెమెరామెన్ అవార్డును ఆర్.రత్నవేల్, ఉత్తమ చారిత్రాత్మక చిత్రంగా 'రజాకార్'ను ఎంపిక చేయగా, ఆ చిత్ర నిర్మాత గూడూరు నారాయణ రెడ్డికి ప్రదానం చేశారు. అలాగే, ప్రజాసేవ విభాగంలో విశిష్ట ఉగాది పురస్కార కింద 'మహిళారత్న' అవార్డును హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్త సరోజ వివేకానంద్‌కు, దివంగత నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవికి, 'లతా మంగేష్కర్' పురస్కారాన్ని ప్రముఖ సినీ నేపథ్యగాయని కల్పనకు, 'పీబీ శ్రీనివాస్' పురస్కారాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు, నేపథ్యగాయకుడు ఆర్పీ.పట్నాయక్‌కు, సినీ గేయరచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌కు, ఉత్తమ సహాయ నటి అవార్డును సినీనటి రోహిణికి, ఉత్తమ నటి అవార్డును ఇంద్రజకు, ఉత్తమ జ్యూరీ అవార్డును నటుడు సంపూర్ణేష్ బాబుకు, ప్రత్యేక పురస్కారాన్ని ప్రముఖ సినీ జర్నలిస్టు ఏ.ప్రభుకు ప్రదానం చేశారు. ప్రముఖ నిర్మాత ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ, పవన్‌కళ్యాణ్ హీరోగా తాను నిర్మిస్తున్న 'హరిహర వీరమల్లు' చిత్రాన్ని మే 9వ తేదీ రిలీజ్ చేస్తామని, చిత్రీకరణ పూర్తిచేసుకుని, నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటుందన్నారు. ఆ చిత్రం విడుదలైన తర్వాత కళాసుధ సభ్యుల కోసం ప్రత్యేక షో ప్రదర్శిస్తామని వెల్లడించారు. జెమిని సురేష్ సభా నిర్వహణ చేయగా, ఇందులో కళాసుధ తెలుగు అసోసియేషన్ సభ్యులు, తెలుగు భాషా అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మరో మూడు రోజులూ ఎండలు

● రెండు వారాలు వర్షాలు

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా మే నెల వేడి తలపించేలా ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. మరో మూడు రోజులపాటు రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు అధికమవుతాయని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు పేర్కొన్నారు. మదురై సహా నాలుగు నగరాల్లో శనివారం పగటిపూట ఉష్ణోగ్రత అధికంగా నమోదైనట్లు తెలిపారు. ఆ మేరకు మదురైలో 104 డిగ్రీలు, సేలంలో 103.64 డిగ్రీలు, వేలూరులో 103.46 డిగ్రీలు, ఈరోడ్‌లో 103.28 డిగ్రీలు, మీనంబాక్కం 102.56 డిగ్రీల ఫారెన్ హీట్ ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఇదే పరిస్థితి మరో మూడు రోజులపాటు ఎండలు విపరీతంగా ఉంటాయని ప్రైవేటు వాతావరణ పరిశోధకుడు హేమచంద్రన్ తెలిపారు. ఏప్రిల్ 3 నుండి రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతాయని అదే సమయంలో వాతావరణం చల్లబడి వర్షాలు కూడా కురుస్తాయన్నారు. దక్షిణాది జిల్లాలు, ఉత్తరాది జిల్లాల్లో రెండు వారాలపాటు చెదురుముదురుగా, ఓ మోస్తరుగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

సమాచార దర్శిని

తిరుచెందూర్‌లో ప్రత్యేక దర్శనాల రద్దు

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మూడు రోజులు ప్రత్యేక దర్శనం రద్దు చేశారు. రూ.100 ప్రజా దర్శనం యధావిధిగా ఉంటుంది. వారాంతపు రోజుల్లో రద్దీ నియంత్రించేలా ప్రత్యేక దర్శనం రద్దు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మేట్టూరు డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాంలో ఇన్‌ఫ్లో పెరిగింది. శనివారం సాయంత్రం డ్యాంలోని 425 ఘనపుటడుగుల మేర వస్తున్న నీరు ఆదివారం ఉదయం 587 ఘనపుటడుగులకు పెరిగింది. డ్యాం నుంచి తాగునీటి అవసరాలకు వెయ్యి ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో నీరు 75.87 టీఎంసీ లున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

10 వరకు అగ్నివీర్ దరఖాస్తుకు అవకాశం

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): 'అగ్నివీర్' పథకంలో భారత ఆర్మీలో చేరేందుకు ఏప్రిల్ 10వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అగ్నివీర్ పథకంలో నాలుగేళ్ల సైన్యంలో పనిచేసేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. టెక్నికల్ వర్క్, జనరల్ వర్క్, సైనికుడు, క్లర్క్, హవల్దార్ సహా పలు విభాగాల్లో అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. రాతపరీక్ష, దేహధారుడ్య పరీక్ష, మెడికల్ టెస్ట్, సర్టిఫికెట్లు పరిశీలన తదితరాల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు www.joinindianarmy.nic.in అనే వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 10వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

కుండ్రత్తూర్ ఈబీ కార్యాలయం చిరునామా మార్పు

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా కుండ్రత్తూర్ డివిజన్ పరిధిలో కుండ్రత్తూర్ నగర విద్యుత్ బోర్డు అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయం ప్రస్తుతం నెం.1, వెళ్లాల్ వీధి, కుండ్రత్తూర్‌లో పనిచేస్తోంది. ఈ కార్యాలయం ఏప్రిల్ 1 నుంచి నెం.1151/1, మురుగన్ ఆలయ మెయిన్ రోడ్డు, కుండ్రత్తూర్ అనే చిరునామాకు మారుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రాష్ట్రంలో ఏడు కొత్త మున్సిపాలిటీలు

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడు కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆ ప్రకారం, పోరూర్, సెంగం, కన్నియాకుమారి, కోతగిరి, అవినాశి, పెరుందురై, సంగగిరి తదితర ఏడు కొత్త మున్సిపాలిటీగా హోదా పెంచారు. వివిధ పార్టీలు, పలు సంఘాలు, ప్రజల నుంచి సేకరించంచిన అభిప్రాయాల మేరకు ఏడు కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటుచేసినట్లు ప్రభుత్వం జీవోలో పేర్కొంది.

పెరిగిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దినసరి విద్యుత్ వినియోగం పెరిగింది. రాష్ట్ర దినసరి వినియోగం సాధారణంగా 16వేల మెగావాట్లు ఉంటుండగా, వేసవి సీజన్‌లో వినియోగం పెరుగుతోంది. ఈ ప్రకారం, గత ఏడాది మే 2వ తేది విద్యుత్ వినియోగం అత్యధికంగా 20,830 మెగావాట్లుగా నమోదైంది. ఈ నెల మొదటి వారం నుంచే ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఏసీ వినియోగం అధికమైంది. ఈ నేపథ్యంలో, గత శుక్రవారం దినసరి విద్యుత్ వినియోగం 19వేల మెగావాట్లకు చేరిందని, ఏప్రిల్, మే నెలల్లో 22,000 మెగావాట్లకు చేరే అవకాశముందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

తూత్తుకుడి నుంచి అదనపు విమాన సర్వీసులు

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి నుంచి చెన్నై, బెంగళూరు నగరాలకు అదనపు విమాన సర్వీసులు నడపనున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ప్రస్తుతం తూత్తుకుడి నుంచి చెన్నైకి 8, బెంగళూరు 2 మొత్తం 10 విమాన సర్వీసులున్నా యి. పండుగలతో పాటు సాధారణ రోజుల్లో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఆదివారం నుంచి చెన్నైకు అదనంగా 6, బెంగళూరుకు 4 విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఆ ప్రకారం, తూత్తుకుడి నుండి చెన్నై, బెంగళూరుకు మొత్తం 18 విమానాలు అందుబాటులోకి వచ్చాయి. కరోనా సమయంలో తగ్గించిన విమాన సేవలు మళ్లీ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

రైళ్లలో మహిళల భద్రతకు 47 వాట్సాప్ బృందాలు

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో మహిళలకు భద్రత కల్పించే దిశగా తొలివిడతగా 47 వాట్సాప్ బృందాలు ఏర్పాటుచేసినట్లు రైల్వే పోలీసు విభాగం తెలిపింది. ఎక్స్‌ప్రెస్, సబర్బన్ రైళ్లలో మహిళలపై లైంగిక వేధింపులు, చైన్ స్నాచింగ్ తదితరాలు అధిమవుతున్నాయి. ఇటీవల ఒక ఎక్స్‌ప్రెస్ రైలులో గర్భిణిని వేధించి రైలు నుంచి తోసివేసిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటన అనంతరం రైళ్లలో మహిళల భద్రత కట్టుదిట్టం చేసేలా రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రాత్రి వేళ రైల్వే పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులను నియమించ నున్నారు. సబర్బన్ రైళ్లలో ప్రతి రోజు ప్రయాణించే మహిళలు, వ్యాపారులు, ఇతర పనులకు వెళ్లే వారితో వాట్సాప్ బృందం ఏర్పాటుచేశారు. తొలివిడతగా 47 వాట్సాప్ బృందాలు ఏర్పాటుచేసినట్లు, రైళ్లలో మహిళలపై జరిగే నేరాలు, ఘోరాలను వెంటనే ఈ వాట్సాప్ నెంబరు ద్వారా తెలియజేస్తే సత్వరం చర్యలు చేపట్టనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

తిరుత్తణి ఆలయంలో భక్తుల రద్దీ

తిరుత్తణి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని మురుగన్ ఆలయంలో ఆదివారం ఉదయం భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. తెలుగు నూతన సంవత్సరం 'ఉగాది' పండుగను పురస్కరించుకుని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, కేరళ రాష్ట్రాలనుండి కూడా భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చారు. వాహనాల రద్దీ కారణంగా భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. దీనితో రద్దీ ఏర్పడి కొండపైకి వచ్చే వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. సుమారు ఒక గంటకు పైగా వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి.

57 అడుగులకు తగ్గిన వైగై డ్యామ్ నీటిమట్టం

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఆండిపట్టి సమీపంలో ఉన్న వైగై డ్యామ్ నీటిమట్టం 57 అడుగులకు తగ్గింది. ఈ డ్యామ్ నుండి ఐదు జిల్లాల్లో భూములను సాగునీరు సరఫరా చేస్తున్నారు. గత డిసెంబర్ వరకూ వర్షాలు అధికంగా కురవటంతో డ్యామ్ నీటిమట్టం 71 అడుగులకు పెరిగింది. డ్యామ్ పరీవాహక ప్రాంతాల్లో గత ఇరవై రోజులుగా వర్షాలు కురవకపోవటంతో డ్యామ్‌లోకి నీరు ఆగిపోయింది. దీనితో డ్యామ్‌లో నీటిమట్టం క్రమంగా తగ్గి 57.71 అడుగులకు తగ్గింది. ప్రస్తుతం మదురై, దిండుగల్ జిల్లాలో పంటలకు సెకనుకు 722 అడుగుల చొప్పున సాగు జలాలను విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్‌లో 3178 మిలియన్ల ఘనపుటడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. ముల్లైపెరియార్ డ్యామ్ నీటిమట్టం 113 అడుగులుగా ఉంది. ఆ డ్యామ్‌లోకి 105 ఘనపుటడుగుల చొప్పున జలాలను విడుదల చేస్తున్నారు. డ్యామ్‌లో ప్రస్తుతం 1392 మిలియన్ల ఘనపుటడుగుల చొప్పున నీటి నిల్వలు ఉన్నాయి. ఇక మంజలారు డ్యామ్ నీటిమట్టం 31 అడుగులుగా ఉంటోంది. సోత్తుపారై డ్యామ్ నీటిమట్టం 66.25 అడుగులుగా ఉంటోంది. షణ్ముఖనది డ్యామ్ నీటిమట్టం 34 అడుగులుగా ఉంటోంది.



వైగై డ్యామ్



విల్లివాక్కం తిరునగర్ ప్రాంతంలో రూ.50 లక్షలతో నిర్మించిన బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవంలో మంత్రి శేఖర్‌బాబు, ఎంపీ దయానిధి మారన్ తదితరులు

డీఎంకే ఎమ్మెల్యేపై ఎన్నికల కేసు రద్దు

హైకోర్టు ఆదేశం

అడయార్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎమ్మెల్యే ఖాదర్ బాషా అలియాస్ ముత్తురామలింగంపై ఉన్న కేసును మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. ఆయన మద్రాస్ హైకోర్టులో ఒక పిటిషన్ వేశారు. అందులో గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా, 2021 మార్చి 13వ తేదీన రామనాథపురం రోమన్‌చర్చి సమీపంలో ప్రచారంలో పాల్గొన్నారు.ఆసమయంలో ఎన్నికల సంఘం అనుమతించిన దాని కంటే ఎక్కువ వాహనాల్లో వెళ్లినట్టుగా తనతో పాటు మొత్తం ఏడు మందిపై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో రామనాథపురం కోర్టులో చార్జిషీటు కూడా దాఖలుచేయగా,ఈ కేసులో పోలీసులు ఎలాంటి ఆధారాలను సమర్పించలేదు.అందువల్ల తమపై నమోదు చేసిన కేసును రద్దు చేయాలని ఆయన ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. దీన్ని విచారణకు స్వీకరించిన కోర్టు ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న వారికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేని కారణంగా కేసును రద్దు చేస్తున్నట్టు తాజాగా తీర్పునిచ్చింది. దీంతో ఖాదర్ బాషాతో పాటు మొత్తం ఏడుగురిపై ఉన్న ఎన్నికల కేసును హైకోర్టు కొట్టివేసింది.

ఘనంగా ఐవీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం

ప్యారీస్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైష్ ఫెడరేషన్ (ఐవీఎఫ్) తమిళనాడు విభాగం వ్యవస్థాపక దినోత్సవం టి.నగర్‌లోని మత్స్యహాలులో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఐవీఎఫ్ తమిళనాడు అధ్యక్షులు అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకర్‌రావు స్వాగతించగా, ముఖ్యఅతిథిగా టికితారే వ్యవస్థాపకురాలు ప్రసన్న గోవింద్ హాజరై మహిళలు వ్యవస్థాపకులుగా మారడానికి ప్రేరణ ఇచ్చారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ఏడుగురికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శేషాద్రి పువ్వాడ, కోశాధికారి రంగనాధంశెట్టి, మధుప్రియ, జయభారతి, రాఘప్రియ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలతో అజంతా శంకర్‌రావు, శేషాద్రి తదితరులు

ఉపాధి పథకంలో అవినీతి...?

● విచారణ కమిషన్ వేసి తేల్చండి : మంత్రి రఘుపతి

పెరంబూర్, మార్చి30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధి పథకంలో అవినీతి జరిగినట్లయితే బీజేపీ ప్రభుత్వం విచారణ కమిషన్ ఏర్పాటుచేసి నిజాలు తేల్చాలని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి రఘుపతి సవాలు చేశారు. పుదుకోటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగిందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ కమిషన్ ఏర్పాటుచేసి నిజాలను తేల్చాలన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాలు తగ్గవని తెలుపుతున్న కేంద్ర హోం మంత్రి, ఉత్తరాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య పెరగదు అని హామీ ఇవ్వగలరా? అంటూ ప్రశ్నించారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి , రాష్ట్ర సమస్యల కోసమే కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను కలుసుకున్నట్లు చెబుతున్న నేపథ్యంలో, అన్నాడీఎంకే-బీజేపీ కూటమి త్వరలో ప్రకటిస్తామని అమిత్ షా చెబుతున్నారని, ఈ వ్యవహారంలో ఎవరు అబద్ధాలు చెబుతున్నారో త్వరలోనే తెలుస్తుందని మంత్రి రఘుపతి వ్యాఖ్యానించారు.



అన్నానగర్ జోన్ విల్లివాక్కం న్యూ ఆవడి రోడ్డు తిరునగర్ ప్రాంతంలో ఎంపీ దయానిధి మారన్ నియోజకవర్గ అభివృద్ధి నిధి నుంచి కేటాయించిన రూ.30లక్షలతో కొనుగోలు చేసిన మురుగునీటిని తొలగించే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

బోనులో చిక్కిన ఎలుగుబంటి



ఎలుగుబంటిని తరలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కల్లిడైకురిచ్చి సమీపం అంబాసముద్రం తదితర ప్రాంతాల్లో పది రోజులుగా స్థానికులను భయాందోళనకు గురిచేసిన ఎలుగుబంటిని ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో చిక్కింది.ఈనెల 20న స్థానికుల ఫిర్యాదు మేరకు అటవీ శాఖ అధికారులు బోను ఏర్పాటు చేశారు. ఆ బోనులో ఎలుగుబంటికి ఇష్టమైన పండ్లు, తేనె తదితర పదార్థాలు ఉంచారు.ఈనేపథ్యంలో ఆదివారం వేకువజాము ఎలుగుబంటి ఆబోన్‌లో చిక్కింది. స్థానికులు గమనించి అటవీ శాఖ అధికారులకు తెలిపారు.అటవీశాఖ అధికారులు,సిబ్బంది మినీలారీతో అక్కడికిచేరుకుని బోను సహా ఎలుగుబంటిని ఎక్కించుకుని బయలుదేరారు. ఆ తర్వాత కరయారు అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

ముస్లింలకు సహాయాల పంపిణీ

తిరుత్తణి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో, తిరుత్తణి గాంధీరోడ్డులో వున్న మక్కావాసల్ మసీదు నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ముస్లింల ఇళ్లకు వెళ్లి వంటసామగ్రి, మాంసం తదితరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జమాత్ అధ్యక్షులు మహ్మద్ సుల్తాన్ మాట్లాడుతూ, ఎంతో కఠోరమైన ఉపవాస దీక్షలను కొనసాగిస్తున్న ముస్లిం కుటుంబాలకు తమ మసీదు తరుపున ఈ సహాయాల పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు నిర్వాహకులు హబీబ్ రెహమాన్, అబూబకర్, కమిటీ సభ్యులుపాల్గొని పేద ముస్లింలకు సహాయాలు అందిచారు.



సరుకులు అందజేస్తున్న మసీదు నిర్వాహకులు

పబ్లిక్ పరీక్షలకు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షల విధులకు ఉపాధ్యాయులను పంపించని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు చేపడతామని పాఠశాల విద్యాశాఖ హెచ్చరించింది. రాష్ట్ర పాఠ్యప్రణాళికలో ప్రస్తుత విద్యా సంవత్సరం ప్లస్ వన్, ప్లస్ టూ తరగతుల పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. ఈ పరీక్షల విధులకు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులను నియమించారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలు గత శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను 9 లక్షల మందికి పైగా విద్యార్థులు రాయనుండడంతో 4,113 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల సంఖ్య పెరగడంతో ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులను కూడా పరీక్షల విధులకు నియమించాలని ప్రభుత్వ పరీక్ష శాఖ ఆదేశించినా, పలు పాఠశాలలు ఉపాధ్యాయులను పంపిచడం లేదని ఆరోపణలున్నాయి. ఈ విషయమై దృష్టి సారించిన పాఠశాల విద్యాశాఖ, పబ్లిక్ పరీక్షల విధులకు ఉపాధ్యాయులను పంపించని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు చేపడతామని హెచ్చరించింది.

ప్రాణం తీసిన ఈత సరదా

● ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

కుప్పం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చెరువులో సరదాగా ఈతకొట్టడానికి వెళ్లిన తమిళనాడుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి ఒకరు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం నాట్రంపల్లి తాలూకా తిరుపత్తూరుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి జె.సెంథిల్ కుమార్ (17) ఆదివారం కుప్పం మండలం బ్రహ్మదేవర చేన్లు సమీపంలోని చెరువులో ఈతకోసం స్నేహితులతో కలిసి సరదాగా వచ్చాడు. ఈత కొడుతున్న సమయంలో అతను చెరువులో మునిగిపోయాడు. గమనించిన స్థానికులు కాపాడటానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుప్పం అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శాఖాధికారి డి.ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి చెరువులో గాలించి.. సెంథిల్ కుమార్ మృతదేహన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు తరలించారు.

సినిమాలకు భాషాబేధం లేదు... పాఠ్యాంశాలకు కావాలా?


● విజయ్‌ను ప్రశ్నించిన డాక్టర్ తమిళిసై



అడయార్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మీరు నటించే చిత్రాలు పలు భాషల్లో విడుదల కావాలి.. కానీ, చదువుకునే పాఠ్యాంశాలకు మాత్రం పలు భాషలు వద్దా అంటూ తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్‌కు మాజీ గవర్నర్, బీజేపీ మహిళా నేత డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్ ప్రశ్నించారు. ఆదివారం నగరంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, టీవీకేకు అధికార డీఎంకేతో మాత్రమే రాష్ట్రంలో పోటీ అంటూ విజయ్ అంటున్నారన్నారు. ఆయన మాటల్లో మెతకదనం ఉందన్న విషయం స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఆయన డీఎంకే శత్రువు కాదనే విషయాన్ని మొదట గ్రహించాలని కోరారు. ఎంజీఆర్, జయలలిత క్షేత్రస్థాయి నుంచి కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకున్నారన్నారు. అలాగే, ఆ కాలంనటులు సినిమాలు కేవలం తమిళంలోనే విడుదల చేసేవారన్నారు. కానీ, విజయ్ సినిమాలు ఇపుడు అనేక భాషల్లో విడుదలవుతున్నాయన్నారు. అంటే విజయ్ నటించే సినిమాలకు మాత్రం అనేక భాషలు కావాలి.. విద్యార్థులు చదువుకునేందుకు మాత్రం బహు భాషా విధానం వద్దా అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఎదిరించే ధైర్యం తనకు ఉందని చెబుతున్న హీరో విజయ్‌కు ఆయన సినిమాలు తీసే నిర్మాతలను ఎదిరించే ధైర్యం ఉందా అని ఆమె ప్రశ్నించారు. విజయ్ మరింత లోతుగా, క్షుణ్ణంగా రాజకీయాలను అధ్యయనం చేసి, నేర్చుకుని మాట్లాడటం మంచిదని డాక్టర్ తమిళిసై హితవు పలికారు.

ఇతర రాష్ట్రాల్లో షూటింగులు వద్దు

● ఆర్కే సెల్వమణి



అడయార్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తమిళ చిత్రపరిశ్రమకు చెందిన హీరోలు ఇతర రాష్ట్రాలకు వెళ్లి అక్కడ తమిళనాడు రాష్ట్ర సెట్ వేసి షూటింగులు జరుపుతున్నారని, ఈ విధానానికి స్వస్తి చెప్పాలని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి కోరారు. ఆయన ఆదివారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ, తమిళనాడు సినీ నిర్మాతల మండలి, తమిళనాడు యాక్టివ్ సినీ నిర్మాతల మండలి కలిసి సమన్వయంతో పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సినీ నిర్మాణ కార్మికుల జీవనోపాధికి హాని కలిగేలా నిర్మాతలు, నటీనటులు ఎలాంటి వ్యాపారం చేయొద్దని ఆయన కోరారు. ముఖ్యంగా తమిళ చిత్రాల షూటింగులకు తమిళనాడు తరహాలోని సెట్‌లను పొరుగు రాష్ట్రాల్లో నిర్మించి షూటింగులను నిర్వహించవద్దని కోరారు. ఇతర రాష్ట్రాల్లో షూటింగులు జరపడం వల్ల తమిళనాడుకు చెందిన సినీ నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని వెల్లడించారు. అలాగే, దిగ్గజ దర్శకుడు మణిరత్నం, హీరోలు ధనుష్, శింబు చిత్రాల షూటింగులను నిలిపివేయాలని మాకు చెప్పడం మానేసి, నిర్మాతల మండలిలో ఫిర్యాదు చేసి ఆయా సినిమాల షూటింగులను నిలిపివేయొచ్చు కదా, మా మెడపై కత్తిపెట్టి ఒత్తిడి చేయడం ఎంత వరకు సబబని ఆర్‌కే సెల్వమణి ప్రశ్నించారు.

విద్యార్థిని హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

ప్యారీస్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కోవైలోని ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థినిని కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన అనంతరం హత్య చేసిన నిందితుడికి కోవై జిల్లా మహిళా కోర్టు యావజ్జీవ కారాగారశిక్ష విధించింది. పోలీసుల కథనం మేరకు 2019 ఏప్రిల్ 16న ఉదయం ఇంటినుండి కళాశాలకు వెళ్లిన 21ఏళ్ల విద్యార్థిని రాత్రి 8గంటలు దాటినా తిరిగి చేరుకోలేదు. దీనిపై ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కోవై పీఏపీ సాగు కాలువలో శరీరమంతా గాయాలతో కనిపించిన శవాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం చేయించగా, కత్తిపోట్లకు గురై మరణించినట్లు తేలింది. విచారణలో ఆ విద్యార్థినికి చెన్నైకి చెందిన యువకుడితో నిశ్చితార్థం కూడా జరిగింది. మరోవైపు ఆమె దూరపు బంధువు సతీష్‌కుమార్ (28) ఆమెను తనకిచ్చి వివాహం చేయలేదన్న కోపంతోనే హత్యచేసినట్లు తెలిసింది. కేసు విచారణ పూర్తయిన నేపథ్యంలో శుక్రవారం కోవై జిల్లా మహిళా కోర్టు న్యాయమూర్తి నందినిదేవి నిందితుడికి యావజ్జీవ జైలుశిక్షను విధిస్తూ తీర్పువెలువరించారు.

పేలిన విమానం టైరు

● ప్రయాణికులకు తప్పిన ముప్పు

అడయార్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాజధాని జైపూర్ నుంచి చెన్నైకు ఆదివారం వేకువజామున వచ్చిన ఓ విమానం టైరు గగనతలంలోనే పేలిపోయింది. విమాన పైలెట్ చాకచక్యంగా వ్యవహరించి ఎలాంటి ప్రమాదం లేకుండా విమానాన్ని ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎవరికీ ఎలాంటి హాని జరగలేదనీ, ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు. చెన్నై వస్తున్న విమానం ముందు టైరులో సాంకేతిక సమస్య తలెత్తినట్టు పైలెట్లు గుర్తించారు. ఆ వెంటనే ఎయిర్‌పోర్ట్ కంట్రోల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రన్‌వేపై ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే, పైలెట్ చాకచక్యంగా వ్యవహరించి విమానాన్ని సురక్షితంగా ల్యాండింగ్ చేయడంతో ప్రయాణికులతో పాటు ఎయిర్‌పోర్టు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత విమాన టైర్లను పరిశీలించా, ముందు భాగంలోని ఒక టైరు పేలిపోయినట్టు గుర్తించారు.

క్యాన్సర్‌తో బాధపడే భర్తతో కలిసి భార్య ఆత్మహత్య

ప్యారీస్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న భర్తతో పాటే భార్య కూడా ఆత్మహత్యకు పాల్పడి ఘటన తిరువళ్లూరు ఎంజీఆర్‌నగర్ ప్రాంతంలో చోటుచేసుకుంది. సెల్వరాజ్ (59), ఇందిరా (51) దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. పిల్లలందరికీ వివాహం జరిపించి ఒకే ఇంట్లో నివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏడాదికి పైగా క్యాన్సర్‌తో బాధపడుతున్న సెల్వరాజ్ ఇటీవల విరక్తిగా గడిపాడు. క్యాన్సర్ బాధను భరించడం కంటే చనిపోవడమే మేలని అనిపిస్తోందని భార్యకు చెబుతుండేవాడు. దీనితో ఆ దంపతులు బలవన్మరణానికి సిద్ధమయ్యారు. శనివారం రాత్రి తమ గదిలో ఒకే తాడుతో సెల్వరాజ్ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆదివారం ఉదయం శవాలుగా వేలాడుతున్న దంపతులను చూసి చట్టుపక్కల వారు. దిగ్భ్రాంతి చెంది పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం కు తరలించారు.

'గుడ్ ఫ్రైడే' రోజున మద్యం దుకాణాలు మూసివేయాలి

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే రోజున మద్యం దుకాణాలు మూసివేయాలని కోరుతూ జాలర్ల గ్రామాల ప్రజలు శనివారం నిరాహారదీక్ష చేపట్టారు. క్రైస్తవులు ముఖ్య పండుగగా జరుపుకొనే గుడ్ ఫ్రైడే రోజున రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలు మూసివేయాలని క్యాథలిక్ క్రైస్తవ సంఘం డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్‌తో తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సమీపం వీరపాండియపట్టణం గ్రామ సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో ఫాతిమా ఆలయం ప్రాంగణంలో నిరాహారదీక్ష చేపట్టారు. కమిటీ అధ్యక్షుడు పీటర్ వి.రోయర్ అధ్యక్షత వహించగా, వీరపాండియపట్టణం చర్చి ఫాదర్ అలోసియస్ అడిగళార్, తిరునల్వేలి-తూత్తుకుడి జిల్లా ఎక్సైజ్ బోర్డు డైరెక్టర్ జయంతన్ ప్రసంగించారు.



నిరాహారదీక్షలో ప్రజలు, క్రైస్తవులు

పోలీస్ స్టేషన్‌కు వినాయక విగ్రహం



చెరువు గట్టుపై ఉంచిన వినాయక విగ్రహం

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా తిరుపుల్లాని సమీపంలోని మేదలోడ చెరువు గట్టుపై ఉంచిన గణ పతి విగ్రహాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మేదలోడ చెరువు గట్టుపై శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు రెండడుగుల గణపతి విగ్రహం ఉంచి వెళ్లిపోయారు. విగ్రహం విషయాన్ని గ్రామస్తులు తిరుపుల్లాని పోలీసులకు తెలియజేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆ విగ్రహాన్ని ఎవరు ఉంచారు? ఎందుకోసం ఉంచారు అనేది తేలకపోవడంతో విగ్రహాన్ని స్టేషన్‌కు తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ





తిరుత్తణి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలోని ఎల్లమ్మనాయుడుపేటలో తాళం వేసున్న ఇంట్లో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు శనివారం రాత్రి కార్తికేయన్ అనే వ్యక్తి తన కుటుంబసభ్యులతో కలిసి తిరుత్తణిలోవున్న బంధువుల ఇంటికి వెళ్లారు. గమనించిన కొందరు వ్యక్తులు శనివారం రాత్రి సమయంలో తాళంవేసున్న ఆ ఇంట్లోకి ప్రవేశించి బీర్వాలోని రూ.35వేల నగదుతో పాటు పట్టుచీరలను దొంగిలించి వెళ్తుండగా, గమనించిన ఓ గ్రామస్థుడు వారిని పట్టుకోవాలని ప్రయత్నించాడు. అతనిపై దాడిచేసి ఆ నలుగురు దొంగలు పరారయ్యారు. కార్తికేయన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దొంగలను గాలిస్తున్నారు.

పనిచేస్తున్న ఇంట్లో నగల చోరీ : మహిళ అరెస్ట్

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరుగంబాక్కంలోని ఓ ఇంట్లో పనిచేస్తూ 11.5 సవర్ల చోరీ చేసిన మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. విరుగంబాక్కం వేంబులి అమ్మన్ వీధిలో నివసిస్తున్న సుబ్బురామన్ (80) అన్నా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీవిరమణ పొందారు. ఆయన, కుమార్తెలకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇంట్లో పని చేసేందుకు కృష్ణవేణిని నియమించుకున్నాడు. ఈ నెల 22న ఇంట్లోని బీరువా పరిశీలించిన సుబ్బురామన్, అందులో ఉంచిన సుమారు వంద గ్రాముల బంగారు నగలు అదృశ్యం కావడం గుర్తించి, కేకే నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారించిన పోలీసులు, ఇంట్లో పని చేస్తున్న కృష్ణవేణి (51)ని అరెస్ట్ చేసి, ఆమె నుంచి 11.5 సవర్ల నగలు స్వాధీనం చేసుకొని, శనివారం ఆమెను కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ ఆదివారం ప్రకటన విడుదల చేసింది.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

తిరుత్తణి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా ప్రైవేటు బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేటలో చోటుచేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న వద్ద 50ఏళ్ళ ఓ వ్యక్తిని గుర్తుతెలియని ఓ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రరక్తస్రావంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న ఆర్కేపేట పోలీసులు జరిపిన విచారణలో మృతుడు ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుకు చెందిన వాడిగా గుర్తించి కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

రంజాన్‌కు సర్వం సిద్ధం

రాష్ట్రంలో రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు ముస్లిం సోదరులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. ముస్లిం చాంద్రమాన కేలెండర్ 9వ నెలలో వచ్చే 30రోజులు నమాజు, రోజా, తరావీ, షబేఖదర్ జాగరణ, ఫిత్రాదానం, ఎత్తేకాఫ్, జకాత్, సదబ్ వంటి సత్కార్యాలు ఆచరించారు.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి



స్థానిక థౌజెండ్ లైట్స్‌లో విద్యుద్దీపాలతో అలంకరించిన మసీదు

● ప్రత్యేక ప్రార్థనలకు మసీదుల ముస్తాబు ● నేతల శుభాకాంక్షలు

ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి...

మహ్మద్ ప్రవక్త మానవులను కష్టాల నుంచి గట్టెక్కించేందుకు రంజాన్ మాసాన్ని సృష్టించారని ముస్లిం మత గురువులు చాటిచెప్పారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థనల కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మసీదులు, ఈద్గాలు ముస్తాబయ్యాయి. ప్రార్థనలకు వచ్చే ముస్లింలకు ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా రాష్ట్రప్రభుత్వం ప్రార్థనా మందిరాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. మరోవైపు ట్రాఫిక్ నియంత్రణ బాధ్యత కూడా ట్రాఫిక్ పోలీసులకు అప్పగించింది. రంజాన్ పర్వదినాన సేమియాతో ప్రత్యేకంగా తయారు చేసే షీర్‌కుర్మా, బిర్యాని తదితర సరుకులను కొనుగోలు చేస్తున్న ముస్లింలతో నగరంలోని మార్కెట్ ప్రాంతాలు కళకళలాడాయి. ఇదిలా వుండగా, అరబ్ దేశాల్లో శనివారం సాయంత్రం నెలవంక కనిపించడంతో భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో రంజాన్ జరుపుకున్నారు. కాగా, రంజాన్ సందర్భంగా గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సహా కాంగ్రెస్, డీఎండీకే, పీఎంకే, డీపీఐ, టీవీకే, టీఎంసీ తదితర రాజకీయ పార్టీల నేతలు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.



రంజాన్ నమాజు కోసం టోపీ పరిశీలిస్తున్న దృశ్యం

ఘనంగా ప్రపంచ ఇడ్లీ దినోత్సవం

● మూడు నిమిషాల్లో 100 రకాల చట్నీల తయారీ

ప్యారీస్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సమయల్ కలై తొలిలాలర్ మున్నేట్ర సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఇడ్లీ దినోత్సవాన్ని పురస్కరించుకుని 3 నిమిషాల్లో వంద రకాల చట్నీలను తయారు చేసి రికార్డు సృష్టించారు. ఆదివారం ప్రపంచ ఇడ్లీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మాధవరంలోని రేడియన్ సుప్రియ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు కోసం వివిధ రుచులతో మహిళలు మూడు నిమిషాల వ్యవధిలో వంద రకాల చట్నీలను తయారుచేశారు. వాటిని రుచి చూసిన ప్రముఖులు మగువలను అభినందించారు. అదేవిధంగా ఇటీవల అంతరిక్షం నుంచి సురక్షితంగా తిరిగివచ్చిన భారతీయ సంతతికి చెందిన సునీత విలియమ్స్ సేవలను కొనియాడుతూ ఆమె ఆకారంతో తయారుచేసిన భారీ ఇడ్లీ సందర్శకులను ఆకట్టుకుంది. సంఘ అధ్యక్షులు ఇనియన్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మాజీమంత్రి హెచ్‌వి హండే, అడయార్ ఆనందభవన్ అధినేత శ్రీనివాసరాజు తదితరులు పాల్గొని ఇనియన్ సేవలను కొనియాడారు. కాగా, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు ఇనియన్‌కు సర్టిఫికెట్ అందజేశారు.



లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్ అందుకుంటున్న ఇడ్లీ ఇనియన్

కేసీజీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ స్నాతకోత్సవం

● 915 మందికి పట్టాల ప్రదానం



పట్టభద్రులైన విద్యార్థులతో డాక్టర్ ఆనంద్ జేకబ్ వర్గీస్, సీవీ దీపక్ తదితరులు

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కారపాక్కంలోని కేసీజీ సాంకేతిక కళాశాల 23వ స్నాతకోత్సవం ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ సీవీ దీపక్ పాల్గొని 915 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. రాష్ట్ర స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ మిషన్ డైరెక్టర్ శివ రాజ రామనాథన్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. లోకేశ్వరన్, హరిహరన్ అనే పూర్వ విద్యార్థులు దాస్‌గ్రివ్ ఎయిరోస్పేస్ పేరుతో రూపొందించిన స్టార్ట్ అప్‌ను ఈ కార్యక్రమంలో ప్రారంభించారు. హిందూస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ ఆనంద్ జేకబ్ వర్గీస్, డిప్యూటీ డైరెక్టర్ ఎనిడ్ వర్గీస్ జేకబ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ముత్తుకన్నన్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ అన్నీ జేకబ్, డీన్ డాక్టర్ జి. ప్రభాకరన్ తదితరులు పాల్గొన్నారు.

పాంబన్ కొత్త వంతెనపై రిహార్సల్స్

● 12 నిమిషాలు వీక్షించనున్న ప్రధాని మోదీ



పాంబన్ వంతెన దాటుతున్న కోస్ట్‌గార్డ్ నౌక

పెరంబూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీపం పాంబన్ కొత్త రైలు వంతెన ప్రారంభోత్సవం సందర్భంగా రిహార్సల్స్ నిర్వహించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ జాతీయ రహదారిలో వంతెనపై నిలబడి 12 నిమిషాలు వీక్షించనున్నారు. పాంబన్ సముద్రంపై నిర్మించిన కొత్త రైలు వంతెనను ఏప్రిల్ 6వ తేది ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఆ సమయంలో తాంబరం-రామేశ్వరం కొత్త రైలు కూడా ప్రధాని ప్రారంభిస్తారు. అలాగే, రైలు వంతెన ప్రారంభించిన తర్వాత ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌక వెళ్లడాన్ని ప్రధాని వీక్షిస్తారు. కాగా శనివారం బోగీలతో కూడిన రైలింజన్ కొత్త వంతెనపై నడిపి రిహార్సల్స్ చేశారు. అనంతరం లిఫ్ట్ వంతెన పైకి లేపగా ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌక వెళ్లేలా రిహార్సల్స్ చేశారు. ఈ రిహార్సల్స్‌ను మదురై ప్రాంతీయ రైల్వే మేనేజర్ శరత్ శ్రీ వాత్సవ, కోస్ట్‌గార్డ్ పోలీసు విభాగం, రైల్వే అధికారులు పర్యవేక్షించారు.

తిరుచెందూరుకు పోటెత్తిన భక్తులు

● స్వామివారి దర్శనానికి 5 గంటలు



తిరుచెందూరు ఆలయం వద్ద గుమికూడిన భక్తులు

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం మురుగప్పెరుమాన్ కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో రెండవ క్షేత్రం, పరిహార స్థలంగా ఖ్యాతి చెందిన తిరుచెందూరు సెందిల్ ఆండవర్ ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం స్వామివారి దర్శనం కోసం వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు తరలివచ్చారు. ఈ రాష్ట్రాల నుండి భక్తులు శనివారం రాత్రే తిరుచెందూరు చేరుకున్నారు. ఆదివారం వేకువజాము భక్తులంతా సముద్రతీరంలో స్నానమాచరించి, నాళికినరులో పవిత్ర జలాలను శిరస్సుపై చల్లుకుని స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో నిలిచారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆలయాన్ని వేకువజాము 4 గంటలకే తెరిచారు. 4.30 గంటలకు విశ్వరూపదర్శనం, 6 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం నిత్యపూజలు నిర్వహించారు. వాహనాల్లో వచ్చిన భక్తులకోసం తీర్థకొలను సమీపంలో, తాలూకా కార్యాలయం వద్ద ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఇక ధర్మదర్శనం క్యూలైన్లలో నిలిచిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు సుమారు ఐదు గంటలు పట్టింది. క్యూలైన్లలో నిలిచిన భక్తుల కోసం మంచినీటి సదుపాయం కూడా ఏర్పాటు చేశారు.

ఘనంగా అవోపా ఉగాది పురస్కారాలు



పురస్కార గ్రహీతలతో తాడేపల్లి రాజశేఖర్, గోపురం కుంకుమ అధినేత వైవీఎస్ హరికృష్ణ తదితరులు

ప్యారీస్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్యవైశ్య ఆఫిషియల్ అండ్ ప్రొఫెషినల్స్ అసోసియేషన్ (అవోపా) తమిళనాడు, అన్నానగర్ ఆర్యవైశ్య సంఘ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. టి.నగర్ రాజ్‌ప్యాలెస్‌లో ఉదయం 11గంటలకు ప్రార్థన, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుకలకు అవోపా అధ్యక్షులు తాడేపల్లి రాజశేఖర్ సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వున్న ఆర్యవైశ్య సంఘాలన్నీ అంకితభావంతో సమాజశ్రేయస్సుకు తమ వంతు కృషిచేస్తున్నాయని కొనియాడారు. అవోపా తరుపున వైశ్యులందరినీ కలుపుకుని భారీస్థాయిలో వేడుకలు జరిపి తమ బలాన్ని పాలకులకు చూపించేందుకు త్వరలో బృహత్తర ప్రణాళికరూ పొందించనున్నట్లు తెలిపారు. విశ్వావసు ఉగాది సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న విద్యావేత్త కేకే.బాలు, ఆడిటర్ డాక్టర్ వి.మురళి, ప్రేమ్ ఫార్మా అధినేత పీఎస్ కుమరవేల్, పారిశ్రామికవేత్త ఎం.పవిత్ర ఇన్బరాజ్‌లకు ఉగాది పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా దేశంలో పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించారు. కార్యదర్శి సి.రంగనాథంశెట్టి, ట్రెజరర్ పేర్ల రాధాకృష్ణ, అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గోపురం కుంకుమ అధినేత వైవీఎస్ హరికృష్ణ, కార్యదర్శులు ఎం.కాశీవిశ్వనాథం, ఎస్వీ ప్రసాద్‌రావు, ట్రెజరర్ అంకం శ్రీనివాసులు, అపోలో సుబ్రమణ్యం, టింబర్ సుబ్బారావు, అవోపా మాజీ అధ్యక్షులు టీజీ శ్రీనివాసన్, చారుగుండ్ల వెంకటేశ్వరరావు, కేఎం సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ భరత నాట్య కళాకారిణుల నృత్యప్రదర్శన అలరించింది. ఉగాది పచ్చడిని ఆహ్వానితులందరికి పంపిణీ చేశారు. కార్యక్రమం ఏర్పాట్ల టి.జయశ్రీ రాజశేఖర్, ఆశిష్, హర్షిత, నిర్వాహకులు పర్యవేక్షించారు.

తెలుగు సంఘాల ఆధ్వర్యంలో వైభవంగా ఉగాది వేడుకలు

ప్యారీస్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తెలుగు సంఘాల ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. టీటీడీ శ్రీవెంకటేశ్వరాలయం , ఆస్కాలో ఆంధ్ర కళాస్రవంతి, కళాసుధ, చెన్నైతెలుగు అసోసియేషన్ తెలుగు బ్రాహ్మణ సమాజం తదితర సంఘాల్లో ఆదివారం ఉదయం నుండే ఉగాది సందడి ప్రారంభమయ్యాయి. పంచాంగ పఠనం, తెలుగు ప్రముఖులకు పురస్కారాలందజేయడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అంటూ అన్ని చోట్లా ఉగాది వేడుకలు కనువిందుగా సాగాయి. చివరగా ఉగాది పచ్చడి, ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆంధ్రకళా స్రవంతి ఆధ్వర్యంలో



అతిథులు, సభ్యులతో జేఎం నాయుడు, ఎంఎస్ మూర్తి, జె.శ్రీనివాస్ తదితరులు

ఆంధ్రకళా స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొరట్టూరు అగ్రహారంలో అన్నై అవెన్యూలో వున్నకోదండ రామాలయం కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ వేడుకలకు ఆంధ్రకళా స్రవంతి అధ్యక్షులు జేఎం.నాయుడు అధ్యక్షత వహించగా, సీనియర్ అడ్వకేట్ ఆర్ఎస్ జీవరత్నం ముఖ్యఅతిథిగా, ఛార్టెడ్ ఇంజనీర్ భోజనాల నాగరాజ గుప్తా, జేఎస్ చిట్‌ఫండ్స్ ఎండీ డా.ఎంవీ నారాయణ గుప్తా విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. సాయంత్రం 4 గంటలకు వేదపండితులు సుసర్ల కుటుంబశాస్త్రి పంచాంగ పఠనం చేశారు.. అనంతరం అతిథులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్ అడ్వైజర్ ఎంఎస్ మూర్తి, కోశాధికారి జీవి రమణ, ఉపాధ్యక్షులు కేఎస్ సురేష్‌బాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేసి, దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, బ్యాగులు, ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి పంపిణీ చేశారు.

టీబీఎం ఆధ్వర్యంలో



అతిథులకు జ్ఞాపికలు ప్రదానం చేస్తున్న టీబీఎం నిర్వాహకులు

నగరంలోని తెలుగు బ్రాహ్మణ మహాసభ (టీబీఎం) ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. టి.నగర్‌లోని ఆర్కేఎం శారదా విద్యాలయం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం గణపతిపూజ, పణిశర్మ పంచాంగ పఠనంతో ప్రారంభమైన ఈ వేడుకలో మహాసభ అధ్యక్షులు గోటేటి వెంకటేశ్వరావు స్వాగతోపన్యాసం చేశారు. అలాగే పలు రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న ప్రముఖులను సత్కరించడంతో పాటు పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కమిటీ తరుపున నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ముందుగా ముఖ్యఅతిథి విజయవాడకు చెందిన జంధ్యాల వెంకటరమణను టీబీఎం మాజీ అధ్యక్షుడు కల్య రఘుకుమార్ సభకు పరిచయం చేసి, సత్కరించారు. అనంతరం జీఎస్ శ్రీనివాసుల శాస్త్రికి 'వేద విద్యా ప్రవీణ', రుక్మిణి శ్రీకృష్ణకు 'గాన విద్యా ప్రవీణ', ఆర్కే రామకృష్ణకు 'సమాజసేవా ప్రవీణ' అనే బిరుదులు ప్రదానం చేసి సన్మానించారు. అనంతరం ప్రముఖ కళాకారులు త్యాగరాజ కీర్తనలు శ్రావ్యంగా ఆలపించారు.

పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో...



ఉగాది వేడుకల్లో నిర్వాహకులు

వాసవీ క్లబ్ ఎలైట్ చెన్నై, వనిత ఎలైట్ చెన్నై, పిరమిడ్ మెడిటేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. నెర్కుంద్రంలో జరిగిన ఈ వేడుకలను పిరమిడ్ మెడిటేషన్ నిర్వాహకులు అమరా చంద్రశేఖర్, అమరా ప్రశాంతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ సుజాత రమేష్‌బాబు, వాసవీ క్లబ్ గవర్నర్ సీఎం రాజేష్, డాక్టర్ రమేష్‌బాబు, జ్యోష్న, మన్నారు ఉదయ్‌కుమార్, విశాలక్ష్మీ, గీతా ప్రసాద్, జ్యోతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేపీడీలో...

జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 6 గంటలకు అర్చకులు ఎవిత్రజల పుష్పకలశాలను ఊరేగించి, అనంతరం పంచాంగ పఠనం చేశారు. సామూహిక వాసవీ అష్టోత్తర నామార్చన, రాత్రి 102 దీపాలతో దీపారాధన, 150 గంపల పూలతో పుష్పయాగం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయపూజారులు నిర్వహించారు.



పుష్పయాగంలో పాల్గొన్న ట్రస్టీలు, భక్తులు



ఆస్కా ఆధ్వర్యంలో..

తెలుగువారి తొలిపండుగ ఉగాదిని ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ట్రస్టు నిర్వహణలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ కే సుబ్బారెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ పి.శ్రీనివాస రెడ్డి, కార్యదర్శి ఎ.ఆదినారాయణ రెడ్డి సమక్షంలో టి.నగర్‌లోని ఆస్కా గోదావరి హాలులో ఈ వేడుకలు జరిగాయి. పంచాంగ శ్రవణం జరిగింది. ఉగాది పచ్చడిని అందరికీ పంచిపెట్టారు. మధుర కళానికేతన్ బృందం మాధవి మల్లంపల్లి బృందం కిన్నరసాని కూచిపూడి నృత్యనాటిక ప్రదర్శించారు. డాక్టర్ నరాల రామిరెడ్డి అవధాన సాహిత్యంలో సొగసులు అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చెన్నై ఇన్‌కమ్ టాక్స్ చీఫ్ కమిషనర్ డాక్టర్ డి.సుధాకర్ రావు, జీఎస్టీ కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ మధులత నాగిరెడ్డి హాజరయ్యారు.

తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో..

పెరంబూరులోని డీఆర్‌బీసీసీ మహోన్నత పాఠశాలలో తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం ఉగాది వేడుకలను నిర్వహించింది. అధ్యక్షుడు తమ్మినేని బాబు, కార్యదర్శి పీఆర్ కేశవులు నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు, మద్రాసు వర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షులు విస్తాలి శంకరరావు, పారిశ్రామికవేత్త నర్రావుల వెంకటరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



నత్తంలో అట్టహాసంగా జల్లికట్టు

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా నత్తం సమీపంలోని నత్తమాడిపట్టి ఆలయ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం జల్లికట్టు పోటీ జరిగింది. వాడివాసల్ నుండి పరుగులు తీసిన ఎద్దులను అణచివేయడానికి యువకులు ప్రదర్శించిన విన్యాసాలు అలరించాయి. ఈ పోటీలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ పద్ధతిలో 742 ఎద్దులను ఎంపిక చేశారు. 300 మంది యువకులు పేర్లను నమోదు చేసుకున్నారు. తొలుత యువకులకు ఆరోగ్య పరీక్షలు జరిపిన మీదట వారి చేత జంతు హింస వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ పోటీలో పాల్గొనేందుకు దిండుగల్, తేని, మదురై, పుదుకోట, తిరుచ్చి, శివగంగ జిల్లాలకు చెందిన జల్లికట్టు ఎద్దులు తెచ్చారు. తొలుత వాడివాసల్ నుండి వివిధ ఆలయాలకు చెందిన ఎద్దులను విడిచిపెట్టారు. ఆ తర్వాత రౌండ్‌కు పదిమంది చొప్పున యువకులు ఎద్దులను అణచివేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఈ పోటీలను ప్రత్యేక వేదిక పై నుండి ప్రముఖ సినీ నటుడు చియాన్ విక్రమ్, నటి దుషారా విజయన్ వీక్షించారు. సాయంత్రం ఐదు వరకు సాగిన ఈ పోటీల్లో గెలిచిన యువకులకు సైకిళ్లు, దీపాలు, మంచాలు, కుర్చీలు, బంగారు కాసులు కానుకలుగా అందజేశారు. అదేవిధంగా ఈ పోటీల్లో ఎద్దుల దాడిలో 25 మంది యువకులు గాయపడ్డారు. వీరికి అక్కడే ఏర్పాటు చేసిన వైద్యశిబిరాల్లో చికిత్సఅందించారు. ఈ జల్లికట్టు పోటీలను చివరిదాకా నటి దుషార విజయన్‌తో కలిసి వీక్షించిన నటుడు విక్రమ్ మాట్లాడుతూ యువకులు ఎద్దులను అణచివేసేందుకు ప్రాణాలకు తెగించి చేసిన పోరాటం చూసి ఆశ్చర్యపోయానని చెప్పారు. సినిమాలలో తాము చేసేందంతా నటన మాత్రమేనని జల్లికట్టు మైదానంలో ఎద్దులను అణిచివేయానికి ప్రాణాలకు తెగించే యువకులే నిజమైన హీరోలని చెప్పారు.





జల్లికట్టు తిలకిస్తున్న సినీనటుడు చియాన్ విక్రమ్, నటి దుషారా విజయన్ - వాడివాసల్ వద్దే ఎద్దును అణచివేసేందుకు ప్రయత్నిస్తున్న యువకుడు